సాక్షి ప్రకాశం

మంగళవారం । 26 । ఆగస్టు । 2025



అక్రమ ఎరువులపై విజిలెన్స్ కొరడా

పొదిలి, ముండ్లమూరు మండలాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులను సీజ్ చేశారు.

- 8లో..



పోలీస్ గ్రీవెన్స్‌కు 80 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 80 ఫిర్యాదులు వచ్చాయి.

- 8లో..

గరిష్టం/కనిష్టం 36 /27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెన్షన్ సవరణ క్లాజ్ రద్దు చేయండి

● ఏపీఆర్‌పీఏ డిమాండ్



ప్రకాశం భవనం వద్ద ధర్నా చేస్తున్న ఏపీఆర్‌పీఏ నాయకులు

ఒంగోలు సిటీ: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లులో దొంగచాటుగా చూపించిన పెన్షన్ సవరణ క్లాజ్ ను తక్షణమే రద్దు చేయాలని ఏపీఆర్‌పీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ రాంబాబు డిమాండ్ చేశారు. ఏపీఆర్‌పీఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ప్రకాశం భవనం వద్ద జీ శేషయ్య అధ్యక్షతన సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో సంఘం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సీహెచ్.రాంబాబు మాట్లాడుతూ ఈపీఎస్ 95 పెన్షన్‌దారులకు కనీస పెన్షన్ రూ.9 వేలు, డీఏ ప్రకటించాలని, సీనియర్ సిటిజన్‌లకు రైల్వేలో 50 శాతం రాయితీని పునరుద్ధరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 8వ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షనర్లకు 12వ వేతన సవరణ కమిటీలను తక్షణమే నియమించి ఐఆర్ 30 శాతం ప్రకటించాలన్నారు. పెన్షన్‌దారులకు, ఉద్యోగులకు రావలసిన బకాయిలు వెంటనే మంజూరు చేయాలని, పెన్షన్‌దారులకు రావాల్సిన కమ్యూటేషన్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలు మంజూరు చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేశారు. యూనియన్ నాయకులు మీగడ వెంకటేశ్వర రెడ్డి, టీవీఆర్ సుబ్బారావు, సీహెచ్ లక్ష్మీనారాయణ, రాబిన్ రవికుమార్, పీ పేరయ్య మాట్లాడారు. ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు శరత్ బాబు కృష్ణారెడ్డి, బీఎస్ఎన్ఎల్ సంఘ నాయకులు నాగేశ్వరరావు, పోస్టల్ సంఘ నాయకులు కే వీరాస్వామి రెడ్డి, ఎస్జీపీఏ నాయకులు పరిటాల సుబ్బారావు, సీఐటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు అయ్యప్ప రెడ్డి తదితరులు సందేశాలిచ్చారు. ధర్నా అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.



గ్రామగ్రామాన ఏజెంట్లు..

బియ్యం సిండికేట్లు

రేషన్ మాఫియా చౌకబియ్యాన్ని కొల్లగొడుతోంది. పశ్చిమ ప్రకాశం అడ్డాగా కాకినాడ పోర్టు మీదుగా పేదల బియ్యం విదేశాలకు తరలిపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది మొదలు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అధికారులు ఎర్రతివాచీ పరుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బియ్యం సేకరణకు పట్టణాల నుంచి గ్రామాల వరకూ ప్రత్యేక ఏజెంట్లను నియమించుకున్నారు. డీలర్ల నుంచి సేకరించిన బియ్యాన్ని ఒక చోటికి చేర్చి లారీల్లో దర్జాగా పోర్టుకు తరలిస్తున్నారు. నిఘా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో వీరి దందాకు అడ్డేలేకుండా పోతోంది.

- పశ్చిమం టు కాకినాడ పోర్ట్
- యథేచ్ఛగా రేషన్ బియ్యం స్మగ్లింగ్
- అధికార టీడీపీ నేతల కనుసన్నల్లో అక్రమ రవాణా
- మార్కాపురం, యర్రగొండపాలెం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లో రెచ్చిపోతున్న పచ్చ నేతలు
- బియ్యం రవాణాకు ప్రత్యేక బృందాల ఏర్పాటు
- పోర్టుకు పోగా మిగిలిన బియ్యానికి పాలిష్
- చూసీ చూడనట్టు మిన్నకుండి పోతున్న అధికారులు
- విజిలెన్స్ అధికారుల తనిఖీలు నిల్..

మార్కాపురం:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రేషన్ పంపిణీ వ్యవస్థను తమ గుప్పెట్లోకి తెచ్చుకున్నారు అధికార టీడీపీ నేతలు. బియ్యం అక్రమ రవాణాను ప్రధాన ఆదాయవనరుగా మార్చుకున్నారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాల్లో అరకొరగా పంపిణీ చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 1392 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 6,37,820 తెల్లకార్డులు ఉండగా, అంత్యోదయ అన్న యోజన కార్డులు 32,807 ఉన్నాయి. ఈ రేషన్ దుకాణాలన్నీ కూటమి పార్టీల నాయకులకు చెందిన డీలర్ల నిర్వహణలో ఉన్నాయి. దీంతో ఎక్కడికక్కడ రేషన్ దుకాణాలను సిండికేట్ చేసి అక్రమంగా బియ్యాన్ని తరలించి జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. జిల్లాకు ప్రతి నెలా 10,582 మెట్రిక్ టన్నుల బియ్యం వస్తోంది. ఇందులో సగానికి పైగా అంటే సుమారుగా 5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం తరలిపోతుందన్నమాట.

మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో టీడీపీ ద్వితీయశ్రేణి నాయకులు బియ్యం అక్రమ రవాణాకు ప్రధాన కేంద్రంగా మారారు. ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, ఎమ్మెల్యేలు రేషన్‌బియ్యం సేకరణకు మండలానికి, పట్టణాలకు టీడీపీ, జనసేనలోని ద్వితీయ శ్రేణి నాయకులను ఏజెంట్లుగా నియమించుకున్నారు. కొంతమంది డీలర్ల ద్వారా రేషన్‌కార్డుదారులకు కిలో రూ.10 చెల్లిస్తూ బియ్యాన్ని సేకరిస్తున్నారు. డీలర్లకు ఏజంట్లు కిలో రూ.15 చెల్లిస్తున్నారు.

దందాకు తెరతీశారిలా..

పశ్చిమ ప్రకాశంలో పేదలకు చెందాల్సిన బియ్యం లారీల ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలి వెళ్తున్నాయి. మార్కాపురం, గిద్దలూరు, కంభం, యర్రగొండపాలెంలలో పౌరసరఫరాల శాఖ గోడౌన్లు ఉన్నాయి. మార్కాపురం గోడౌన్ ద్వారా మార్కాపురం పట్టణ, రూరల్, పెద్దారవీడు, పెద్ద దోర్నాల, తర్లుపాడు మండలాల్లోని రేషన్ దుకాణాలకు, గిద్దలూరు గోడౌన్ ద్వారా గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాలకు, కంభం గోడౌన్‌ద్వారా కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాలకు, యర్రగొండపాలెం గోడౌన్ ద్వారా యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లల చెరువు మండలాలకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి, యర్రగొండపాలెం నియోజకవర్గంలో యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాలున్నాయి. గిద్దలూరు నియోజకవర్గంలో కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, గిద్దలూరు మండలాలు ఉన్నాయి. సుమారు 200కు పైగా రేషన్ షాపులుండగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత టీడీపీ నాయకులు రెవెన్యూ అధికారుల సహాయంతో డీలర్లను బెదిరించి రాజీనామాలు చేయించారు. అయితే రాజీనామా చేయని డీలర్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు, గోడౌన్ డీటీలతో బెదిరింపుల పర్వానికి దిగారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. మీపై 6ఎ కేసులు నమోదు చేస్తామని తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవడంతో పలువురు రాజీనామా చేశారు. వారి స్థానంలో టీడీపీ సానుభూతిపరులను నియమించుకున్నారు.

రేషన్ బియ్యానికి పాలిష్..

కార్డుదారుల నుంచి సేకరించిన బియ్యంలో అధిక మొత్తం పోర్టుకు తరలిస్తున్నారు. మిగిలిన సరుకును నంద్యాల, అనంతపురం, నరసరావుపేట ప్రాంతాల్లో పాలిష్‌పెట్టి మళ్లీ సన్న బియ్యంగా ప్రజలకు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మరి కొంత మంది వ్యాపారులు రేషన్ బియ్యాన్ని రవ్వగా మార్చి విక్రయిస్తున్నారు. ఈ బియ్యపు రవ్వను బొంబాయి రవ్వలో కలుపుతున్నారని తెలుస్తోంది.

నిఘా నిల్...

డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలో గత రెండు నెలల నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి లేకపోవడంతో బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బదిలీ అయి వెళ్లిపోగా ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. అలాగే పోలీస్, రెవెన్యూ, తనికలు కొలతలు, వాణిజ్య పన్నుల శాఖ ఇలా అన్ని విభాగాల అధికారులు బియ్యం దందాపై చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

అక్రమాలు ఇలా...

కొంత మంది కార్డుదారులకు బియ్యం స్థానంలో కిలో 10 రూపాయల ప్రకారం డబ్బులు చెల్లిస్తున్నారు. తర్లుపాడు మండలంలోని కేతగుడిపి పంచాయతీలో ఓ రేషన్ డీలరు కార్డుదారులకు బియ్యానికి బదులుగా డబ్బులు ఇస్తున్న వీడియో బయటకు వచ్చింది. ఇలా ప్రతి మండలం నుంచి సుమారు 100 నుంచి 150 బస్తాల బియ్యం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తున్నట్టు సమాచారం. ఇలా డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఇదే తంతు నడుస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. డీలర్లు కార్డుదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్‌లో భద్రపరుస్తున్నారు. వాటిని రాత్రుళ్లు గుట్టుచప్పుడు కాకుండా లారీల ద్వారా ఒంగోలుకు, అక్కడి నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నట్లు తెలిసింది.

కొత్తవి ఇవ్వకపోగా..ఉన్నవి పీకేస్తున్నారు

- దివ్యాంగుల పొట్టగొడుతున్న టీడీపీ కూటమి ప్రభుత్వం
- గతంలో డాక్టర్ ఇచ్చిన సర్టిఫికెట్లు ఇప్పుడెలా తీసేస్తారు
- కాళ్లు, కళ్లులేని వారి పెన్షన్ కూడా తొలగించారు
- దివ్యాంగుల పక్షాన నిలిచి వాళ్ల గోడు జిల్లా అధికారులకు వినిపించిన వైఎస్సార్ సీపీ నేతలు



దివ్యాంగులతో కలిసి కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ కి వస్తున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున, బత్తుల బ్రహ్మానందరెడ్డి, చుండూరు రవిబాబు తదితరులు



దివ్యాంగుల పింఛన్ల సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సబర్బన్: టీడీపీ కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా...ఉన్న పెన్షన్లు పీకేస్తున్నారు...ఇదెక్కడి అన్యాయమని మాజీ మంత్రి, సంతనూతలపాడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. పింఛన్లు కోల్పోయిన దివ్యాంగులను తీసుకొని కలెక్టరేట్‌లో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మీ కోసం కార్యక్రమానికి మేరుగు నాగార్జున సోమవారం వచ్చారు. వైఎస్సార్‌సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులు దివ్యాంగుల వెంట వచ్చారు. వాళ్ల వెంట నడుస్తూ దివ్యాంగుల పట్ల టీడీపీ కూటమి ప్రభుత్వ పెద్దలు అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా నినాదాలు చేశారు. అనంతరం దివ్యాంగులను తీసుకొని మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను కలిసి దివ్యాంగులు గోడును మాజీ మంత్రి మేరుగు నాగార్జున వినిపించారు. వాళ్ల కాళ్లు చూడండి, వాళ్ల కళ్లు చూడండి అంటూ కలెక్టర్‌ను మేరుగు నాగార్జున వేడుకున్నారు. ఇలాంటి దివ్యాంగుల పెన్షన్లు తీసేయటానికి ప్రభుత్వానికి మనస్సు ఎలా వచ్చిందని ప్రశ్నించారు. 90 శాతం ఉన్న అంగవైకల్యం ఒక్కసారిగా 35 శాతానికి, 40 శాతానికి ఏ విధంగా పడిపోతుందో చెప్పాలన్నారు. అంటే ప్రభుత్వం కావాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన దివ్యాంగుల పెన్షన్లు ఇవ్వకూడదని నిర్ణయించుకుందా అని కలెక్టర్‌ను ప్రశ్నించారు. మీ కళ్లతో మీరు చూడండి అంటూ కలెక్టర్‌కు దివ్యాంగులను మేరుగు నాగార్జున స్వయంగా చూపించారు. దాంతో రీ వెరిఫికేషన్ పెట్టించి పరీక్షలు చేయిస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా భరోసా ఇచ్చారు.

అనంతరం మేరుగు నాగార్జున మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగులకు, పెన్షనర్లకు అండగా ఉంటుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దివ్యాంగులకు, వృద్ధులకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు అండగా ఉండి ప్రతి ఒక్కరికీ పెన్షన్లు మంజూరు చేసి ఆయా కుటుంబాలను ఆదుకుంటే టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చి ఆ పెన్షన్లు పీకేయటం ఎంతవరకు సబబన్నారు. అనాదిగా పెన్షన్ల మీదే ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలను ఈ రోజు వీధిన పడేస్తారా అంటూ కూటమి ప్రభుత్వ పెద్దలను నిలదీశారు. ఒక్క ప్రకాశం జిల్లాలోనే 3,592 పెన్షన్లు దివ్యాంగులవి తీసేశారంటే ఎంతటి దుర్మార్గానికి కూటమి ప్రభుత్వం ఒడిగట్టిందో అర్థమవుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల పెన్షన్లే లక్ష తీసేశారని, మిగతా పెన్షన్లు 5 లక్షల వరకు తొలగించారన్నారు. ఇంతటి దివాళాకోరు ప్రభుత్వం మరొకటి ఉంటుందా అని ప్రశ్నించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలో 66 లక్షల మందికి పెన్షన్లు అందించారంటే ఆయనది ఎంత పెద్దమనసో అర్థం చేసుకోవాలన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వానికి డబ్బులు ఆదాయం చేద్దామనే తప్ప దివ్యాంగులను ఆదుకోవాలన్న ఆలోచనే లేదన్నారు. గతంలో ప్రభుత్వ డాక్టర్లు ఇచ్చిన సర్టిఫికెట్లు ఇప్పుడే ఎలా తీసేస్తారన్నారు.

వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు గోపిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం కొత్తగా ఇవ్వకపోగా ఉన్నవాటిని తొలగించటం దుర్మార్గమైన చర్య అన్నారు. అర్హులైన వికలాంగులకు అందరికీ పెన్షన్లు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగులను ఇబ్బందులు పెడుతున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, పార్టీ ఒంగోలు ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, దివ్యాంగుల విభాగం రాష్ట్ర కార్యదర్శి కాట్రగడ్డ శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి బొట్ల రామారావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, చెంచి రెడ్డి, క్రాంతి కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

పోలీసుల తీరును తప్పుపట్టిన మేరుగు:

మీ కోసం కార్యక్రమం కోసం దివ్యాంగులను తీసుకొచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసులు అనుసరించిన తీరును మాజీ మంత్రి మేరుగు నాగార్జున తప్పుపట్టారు. తామేమీ ఆందోళన చేయటానికో, ధర్నా చేయటానికో రాలేదని, కొంతమంది దివ్యాంగులను తీసుకొని మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్‌ను కలుస్తామంటే పోలీసులు అడ్డుకోవటం సరైన పద్ధతి కాదన్నారు. ముగ్గురు కానీ నలుగురు కానీ లోపలకు రావాలనటం, అంతవరకే లోపలకు అనుమతిస్తామనటం సరైన పద్ధతి కాదని అసహనం వ్యక్తం చేశారు. ఆంక్షలు పెట్టి దివ్యాంగులను, ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే సహించేది లేదని కూడా మేరుగు నాగార్జున స్పష్టం చేశారు.

పోక్సో కేసులో నిందితునికి మూడేళ్ల జైలు

ఒంగోలు: పోక్సో కేసులో నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ స్థానిక పోక్సో కోర్టు న్యాయమూర్తి కానుగుల శైలజ సోమవారం తీర్పు చెప్పారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు వెల్లడించిన వివరాల ప్రకారం.. జిల్లాలోని హనుమంతునిపాడు మండలానికి చెందిన బాలిక తమ బడ్డీ బంకులో ఒంటరిగా ఉండగా, అదే మండలానికి చెందిన ధనేకుల తిరుపతయ్య 2020వ సంవత్సరం సెప్టెంబర్ 4న మధ్యాహ్నం 2 గంటల సమయంలో కూల్ డ్రింకు అడిగి దాన్ని తీసుకుని బంకులో నుంచి బయటకు రమ్మని బాలికను పిలిచాడు. నిందితుడు తెలిసిన వాడు కావడంతో బాలిక బయటకు వచ్చింది. నిందితుడు ఆ బాలిక నోరుమూసి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక అతికష్టం మీద పెద్దగా కేకలు వేయడంతో నిందితుడు ఆమెను వదిలి పరారయ్యాడు. ఊరెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి రాగా, బాలిక ఏడుస్తూ జరిగిన విషయం చెప్పింది. బాలిక తల్లిదండ్రులు హనుమంతునిపాడు పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై శ్రీహరి కేసు నమోదు చేశారు. కనిగిరి సీఐ కె.వెంకటేశ్వరరావు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయమూర్తి.. నేరం నిరూపణ అయినట్లు పేర్కొంటూ నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా విధించారు.

క్లుప్తంగా

కంభంలో అర్ధరాత్రి చోరీ



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఏఎస్సై

కంభం: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి నగలు, నగదు అపహరించుకెళ్లిన సంఘటన స్థానిక షిరిడీసాయి నగర్‌లో సోమవారం వెలుగుచూసింది. వివరాలు.. షిరిడీసాయి నగర్‌కు చెందిన మట్టిమల్ల భాస్కర్ ఆదివారం ఉదయం అర్ధవీడు మండలంలోని బోగోలులో అత్తగారింటికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం కంభంలోని తన ఇంటికి చేరుకోగా తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై నారాయణ పరిశీలించి వివరాలు సేకరించారు. మూడు జతల బంగారు కమ్మలు, ఒక జత వెండి పట్టీలు, రూ.15 వేల నగదు చోరీ అయ్యాయని బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

మార్కాపురం టౌన్: హత్య కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ సుబ్బారావు సోమవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఈనెల 9న కళాశాల విశ్రాంత అటెండర్ గోగిరెడ్డి కాశిరెడ్డి(65) సత్యనారాయణ స్వామి గుడి వద్ద ఉండగా పట్టణంలోని నానాజాతుల కాలనీకి చెందిన ఆవుల నాగేంద్ర, చల్లా శ్రీనివాసులు అతి వేగంగా వచ్చి ఢీకొట్టారు. ప్రమాద ధాటికి రోడ్డుపై పడిపోయిన కాశయ్య 'ఏమి మిడిమాలంగా బండి తోలుతున్నావురా' అని అనడంతో బైక్‌పై ఉన్న ఇద్దరు వాదనకు దిగి కాశయ్యను కాళ్లతో ఇష్టం వచ్చినట్లు తన్ని, తలను సిమెంటు రోడ్డుకేసి బలంగా బాదారు. గుంటూరులోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ కాశిరెడ్డి మరణించారు. తొలుత దాడి కేసు నమోదు చేసిన పోలీసులు.. కాశిరెడ్డి మృతిపై భార్య వెంకట సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసుగా మార్చారు. డీఎస్పీ ఆధ్వర్యంలో సీఐతోపాటు ఎస్సైలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం ఉదయం మార్కెట్ యార్డు వద్ద ఉన్న నిందితులు ఆవుల నాగేంద్ర, చల్లా శ్రీనివాసులు పోలీసులను గమనించి బైక్‌పై పారిపోయేందుకు విఫలయత్నం చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోనికి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారని సీఐ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

28న ముండ్లపాడులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

గిద్దలూరు రూరల్: వినాయక చవితి పండుగ సందర్భంగా మండలంలోని ముండ్లపాడులో ఈ నెల 28వ తేదీ రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు అందజేస్తారన్నారు. పూర్తి వివరాల కోసం 8919017488 సెల్ నంబర్‌ను సంప్రదించాల్సిందిగా కోరారు.

అక్రమ ఎరువులపై

విజిలెన్స్ కొరడా!

- పొదిలిలో 1704 బస్తాలు, ముండ్లమూరు మండలంలో 270 బస్తాల ఎరువులు సీజ్



ముండ్లమూరులో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న సీఐ



పొదిలి గోడౌన్‌లో సీజ్ చేసిన ఎరువులు

పొదిలి/ముండ్లమూరు(దర్శి): ఎరువుల కొరత, అధిక ధరలతో రైతులు సతమతమతున్నట్లు ప్రచార మాధ్యమాల్లో వెలువడుతున్న కథనాలతో విజిలెన్స్ అధికారులు నిద్ర లేచారు. సోమవారం జిల్లాల్లోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. పొదిలి, ముండ్లమూరు మండలం చింతలపూడిలో 1974 బస్తాల ఎరువులను సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పొదిలి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మీ ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. స్టాక్ రికార్డుల్లో తేడాలను గమనించి ఇక్కడి వెంకయ్యస్వామి ఆలయం ఎదురుగా దుకాణానికి సంబంధించిన గోడౌన్‌పై దాడి చేశారు. 1704 బస్తాల వివిధ రకాల ఎరువులను అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. గోడౌన్‌కు అనుమతులు లేవని తనిఖీలో వెల్లడి కావడంతో ఎరువులతో సహా సీజ్ చేశారు. ఆ ఎరువుల విలువ సుమారు రూ.20.43 లక్షలు ఉంటుందని విజిలెన్స్ అధికారులు చెప్పారు. దుకాణ యజమానిపై 6ఏ కేసుతోపాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించేందుకు ఎరువులు అక్రమంగా నిల్వ చేస్తే డీలర్లపై క్రిమినల్ కేసులు తప్పవని విజిలెన్స్ సీఐ రవిబాబు హెచ్చరించారు. తనిఖీల్లో తహసీల్దార్ పాల్, విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు, వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, దుకాణ యజమాని మాట్లాడుతూ.. తనపై కక్షతో అధికారులు కేసులు నమోదు చేశారన్నారు. గతంలో జరిగిన విషయాలను దృష్టిలో పెట్టుకుని తన గోడౌన్‌ను సీజ్ చేశారని వాపోయారు. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పారు.

270 బస్తాల యూరియా పట్టివేత

ముండ్లమూరు(దర్శి): మండలంలోని చింతలపూడి గ్రామంలో ఎరువుల దుకాణాలను విజిల్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాఘవరావు ఆధ్వర్యంలో సోమవారం తనిఖీలు చేపట్టారు. మల్లికార్జున ట్రేడర్స్ షాపులో బిల్లు లేని 50 బస్తాల యూరియా, నాగార్జున ఫర్టిలైజర్స్ దుకాణంలో రూ.1,56,145 విలువైన 220 బస్తాల యూరియా, కాంప్లెక్స్ ఎరువులు సీజ్ చేశారు. తనిఖీలో విజిలెన్స్ ఏఓ శివనాగ ప్రసాద్, వ్యవసాయాధికారి తిరుమలరావు, కమర్షియల్ ట్యాక్స్ అధికారి రామారావు, హెడ్ కానిస్టేబుల్ రవికుమార్ పాల్గొన్నారు.

సాక్షి స్పెల్‌బీ, మ్యాథ్ బీ, చిన్నారుల ప్రతిభకు పట్టం

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పోటీలకు పాఠశాలల వారీగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

రిజిస్ట్రేషన్స్ చివరి తేదీ సెప్టెంబర్ 10, 2025

కేటగిరీ-1లో 1,2 తరగతులు, కేటగిరీ-2లో 3,4 తరగతులు, కేటగిరీ-3లో 5,6,7 తరగతులు, కేటగిరీ-4లో 8,9,10 తరగతుల వారికి. కేటగిరీల వారీగా బహుమతులతో పాటు చాంపియన్ స్కూల్ ట్రోఫీ, విజేతలకు మెడల్స్, పాల్గొన్న విద్యార్థులందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేస్తారు.





సాక్షి స్పెల్‌బీకి నాలుగు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రౌండ్ పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలోనే జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్ (క్వార్టర్ ఫైనల్స్) మూడో రౌండ్ (సెమీ ఫైనల్స్) నాలుగో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి.

సాక్షి మ్యాథ్ బీకి మూడు రౌండ్లు, నాలుగు కేటగిరీలు
మొదటి రెండు రౌండ్లు పాఠశాల ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి ప్రిలిమినరీ పోటీలు పాఠశాలలో జరుగుతాయి. రాతపూర్వకంగా రెండో రౌండ్‌లో సెమీ ఫైనల్స్, మూడో రౌండ్ ఫైనల్స్ మౌఖిక పరీక్ష జరుగుతాయి. మొదటి రౌండ్ తప్ప మిగతా రౌండ్స్ సాక్షి నిర్ణయించిన వేదికల్లో జరుగుతాయి.

విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తారు | రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 250, మరిన్ని వివరాల కోసం.. (ఉ.10 గం.ల నుంచి సా. 6 గం.ల మధ్య సంప్రదించగలరు)

www.arenaoneschoolfest.com వెబ్‌సైట్లో సంప్రదించవచ్చు.
040- 23256134 / 9505551099 / 9705199924 కు కాల్ చేయవచ్చు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 80 ఫిర్యాదులు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు సిటీ: ప్రజా ఫిర్యాదులపై విచారణ చేపట్టి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చూడాలని ఎస్పీ దామోదర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి 80 మంది బాధితులు హాజరై ఎస్పీ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఫిర్యాదుల పూర్వాపరాలు తెలుసుకున్న ఎస్పీ సంబంధిత స్టేషన్ల పోలీసు అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ప్రభుత్వం ఉద్యోగం పేరుతో చిలకలూరిపేటకు చెందిన వ్యక్తి 5 లక్షలు రూపాయలు తీసుకుని మోసం చేశాడని ఒకరు, తన ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యక్తి అద్దె సొమ్ము చెల్లించకుండా, ఇల్లు ఖాళీ చేయకుండా తననే డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని ఒంగోలు నాగేంద్రనగర్ 1వ లైన్‌కు చెందిన మరొకరు, తాకట్టు పెట్టిన బంగారాన్ని తిరిగి డబ్బు చెల్లిస్తామన్నా ఇవ్వకుండా ఇద్దరు మహిళలు దౌర్జన్యం చేస్తున్నారని ఓ బాధితురాలు ఫిర్యాదు చేశారు.

గ్రీవెన్స్‌లో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ రమణ కుమార్, ఎస్సీ,ఎస్టీ సెల్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పాండురంగారావు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారిని హింసించిన కేసులో వ్యక్తికి జైలు

నాగులుప్పలపాడు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందనే కారణంతో ఓ చిన్నారిని తీవ్రంగా హింసించిన కేసులో నిందితునికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు ఎక్సైజ్ కోర్టు జడ్జి కోమలవల్లి సోమవారం తీర్పు చెప్పినట్లు నాగులుప్పలపాడు ఎస్సై రజియా సుల్తానా తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన భూపతి సుదీర్ ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన చంద్రావతితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. చంద్రావతి కూతురైన మూడేళ్ల చిన్నారి తమ వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందనే కారణంతో ప్రతిరోజూ చిత్రహింసలకు గురిచేశాడు. దీనిపై శిశు సంరక్షణ అధికారి పురుషోత్తమరావు ఫిర్యాదు మేరకు 2021లో నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితునికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

వసతి గృహ విద్యార్థినికి తీవ్ర అస్వస్థత

ఒంగోలు వన్‌టౌన్: స్థానిక అంబేడ్కర్ భవన్ సమీపంలోని సాంఘిక సంక్షేమ శాఖ ఆనంద నిలయంలో ఉంటూ 4వ తరగతి విద్యనభ్యసిస్తున్న ఆర్.ప్రియ అనే బాలిక సోమవారం తీవ్ర అస్వస్థతకు గురైంది. ఉదయం స్కూల్‌కు వెళ్లడానికి సిద్ధమవుతున్న సమయంలో కిందపడిపోవడంతో వార్డెన్, సిబ్బంది చికిత్స నిమిత్తం స్థానిక జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ ఐసీయూలో విద్యార్థినికి చికిత్స అందిస్తున్నారు. వెంటవెంటనే ఫిట్స్ రావడం, ఊపిరి తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండటంతో వైద్యులు చికిత్స అందించారు. మెనింజైటిస్ వ్యాధిగా వైద్యులు అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న బాలిక తల్లిదండ్రులు జీజీహెచ్‌కి చేరుకున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్, ఇతర అధికారులు జీజీహెచ్‌కి వెళ్లి బాలికను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. వసతి గృహం వెనుక చెత్తను డంప్ చేయడంతో ఇన్‌ఫెక్షన్ సోకి ఉంటుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని ఓ నగల దుకాణంలో రెండు బంగారు ఉంగరాలు చోరీ చేసిన ఘటనలో ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ పి.సుబ్బారావు సోమవారం తెలిపారు. వివరాలు.. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాక గ్రామానికి చెందిన తోకల రాజేశ్వరి, మంగళగిరిలోని గండలయ్యపేటకు చెందిన ఇట్టా ప్రసాద్ మార్కాపురంలోని ఓ నగల దుకాణానికి వెళ్లారు. వ్యాపారిని మభ్యపెట్టి అసలు నగల స్థానంలో డూప్లికేట్‌వి ఉంచి చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 24న బోడపాడు రోడ్డులో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి 10.52 గ్రాముల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు వన్‌టౌన్: ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. స్థానిక భాగ్యనగర్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమశాఖ కళాశాల బాలికల వసతి గృహాలు - 2, 3 విద్యార్థులను సోమవారం జేడీ శీలం పరివర్తన భవనంలోకి మార్చారు. ఆధునికీకరించిన పరివర్తనా భవనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు. ఒంగోలులోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల వసతి గృహాలు - 2, 3లో రూ.5.12 కోట్ల డీఎంఎఫ్ నిధులతో అదనపు గదుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. తద్వారా విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరివర్తనా భవనంలోకి మార్చినట్లు చెప్పారు. జిల్లాలోని 38 సంక్షేమ వసతి గృహాల్లో వసతుల కల్పనకు రూ.13 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. డీఎంఎఫ్ నిధుల నుంచి రూ.19 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలను నిర్మూలించడానికి పేద విద్యార్థులు విద్యపై శ్రద్ధ వహించేలా సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. ప్రతి విద్యార్థి పాజిటివ్ దృక్పథంతో, మానసిక స్థైర్యంతో ముందుకు సాగినప్పుడే నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. విద్యతో పాటు ఇతర వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.లక్ష్మానాయక్, నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన ఉప్పుతోళ్ల శ్రీను



రోదిస్తున్న మృతుని భార్య మంగమ్మ

పెద్దదోర్నాల: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పెద్దదోర్నాల మండలం చిన్న గుడిపాడు బస్టాండ్‌లో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాలు మేరకు.. పెద్దబొమ్మలాపురం తూర్పుపల్లెకు చెందిన ఉప్పుతోళ్ల శ్రీను(40) వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై చిన్న గుడిపాడు వచ్చాడు. దోర్నాల వైపు వెళ్లేందుకు బైక్ మలుపు తిపుకొంటున్న సమయంలో గుంటూరు వైపు నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని ఢీకొట్టి ఆగకుండా వెవెళ్లింది. శ్రీను తల నేలకు బలంగా తాకడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడికి భార్య మంగమ్మతోపాటు ఇద్దరు కుమారులు శివ, కార్తీ ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుల బరితెగింపు

- గిద్దలూరు మండలం దొడ్డంపల్లెలో గణేశ్ విగ్రహ తరలింపులో బాణసంచా మోత
- మార్గమధ్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ముందు టపాసులు వేసి కవ్వింపు
- ఆపై కర్రలతో దాడికి పాల్పడటంతో వైఎస్సార్ సీపీ నాయకులు ముగ్గురికి గాయాలు



టీడీపీ నేతల దాడిలో గాయపడిన రమణారెడ్డి

గిద్దలూరు రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పోలీసులు వరుస ప్రకటనలిస్తూ, కమిటీల సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తుండగా టీడీపీ నేతలు మాత్రం కవ్వింపు చర్యలకు దిగి దాడులకు పాల్పడుతున్నారు. గిద్దలూరు మండలంలోని దొడ్డంపల్లె గ్రామంలో వైఎస్సార్ సీపీ శ్రేణులను రెచ్చగొట్టడమే కాకుండా ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడటంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పరస్పర ఘర్షణలో టీడీపీకి చెందిన ఒకరు గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు.. గ్రామంలోని రామాలయం వద్ద వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో గత కొన్నేళ్ల నుంచి వినాయక మండపం ఏర్పాటు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత అదే రామాలయం వద్ద గత ఏడాది మరో మండపం పెట్టారు. ఈ ఏడాది కూడా మండపం ఏర్పాటు చేసిన టీడీపీ నాయకులు గణేశ్ విగ్రహాన్ని తీసుకొస్తూ టపాసులు పేల్చారు. గ్రామ టీడీపీ నేత జయరామిరెడ్డి వర్గానికి చెందిన కొందరు మార్గమధ్యంలో అరుగుపై కూర్చుని ఉన్న వైఎస్సార్ సీపీ నాయకుడు రమణారెడ్డి ముందు టపాసులు వేసి పేల్చారు. ఈ చర్యను రమణారెడ్డి ప్రశ్నించడంతో టీడీపీ వర్గీయులు ఒక్కసారిగా కర్రలతో ఘర్షణకు దిగారు. దాడిలో రమణారెడ్డితోపాటు నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. పరస్పర ఘర్షణలో టీడీపీ నేత జయరామిరెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. గ్రామస్తులు సర్దిచెప్పి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం రమణారెడ్డి, నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డిని నంద్యాలకు తరలించారు.

రజక వృత్తిదారులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- జిల్లా రజక వృత్తిదారుల సంఘం డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రాము

ఒంగోలు సిటీ: రజక వృత్తిదారులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని జిల్లా రజక వృత్తిదారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టంగుటూరి రాము, రాయల మాలకొండయ్య డిమాండ్ చేశారు. రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నిరసనల్లో భాగంగా ఒంగోలు ప్రకాశం భవనం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వృత్తులు అంతరించి పట్టణ ప్రాంతాలకు వలసలు వచ్చి అనేక రకాల వృత్తులైన అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్, ఇంటి పని వారిగా, ఇస్త్రీ దారులుగా, బిల్డింగ్ వర్కర్స్ గా పనులు చేసుకుంటూ చాలీచాలని ఇరుకు గదుల్లో అద్దెకు ఉంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. ఇల్లు, ఇళ్ల స్థలాలు లేని వారు దాదాపు 250 మంది ఉన్నారని, వీరి జాబితా స్థానిక ఎమ్మెల్యేకు ఇచ్చామని, కలెక్టర్‌కు మరొక 16 మంది అర్హత జాబితా కూడా ఇచ్చినట్లు చెప్పారు. వీటన్నింటినీ పరిశీలించి తక్షణమే ఇళ్లు మంజూరు చేయాలని వారు కోరారు. రజకులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. వాటిలో 50 ఏళ్లు నిండిన ప్రతి రజకవృత్తిదారునికి పింఛను మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. రజకులకు కేటాయించిన చెరువుల కుంటలపై హక్కు కల్పించి జీవో నంబర్ 343 అమలు చేయాలని, తెలంగాణలో మాదిరిగా ఆంధ్రాలో కూడా రజక ల్యాండ్రీ వృత్తిదారులకు నెలకు 200 యూనిట్లు ఉచిత కరెంటు ఇవ్వాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లోనే ధోబీ నిర్వహణ కాంట్రాక్టులని రజకులకే కేటాయించాలన్నారు. ధోబి పోస్టులు రజక యువతీ యువకుల ద్వారా భర్తీ చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల మీద దృష్టి పెట్టి భూ ఆక్రమణదారుల నుంచి కాపాడాలన్నారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌లకు కనీస వేతన చట్టం అమలు చేసి నెలకు రూ.18 వేలు ఇవ్వాలని, రజకుల సమస్యలు పరిష్కరించాలన్నారు. సమస్యలపై కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు వినతి పత్రం ఇచ్చారు. ధర్నాకు ఒంగోలు నగర కమిటీ సీఐటీయూ నాయకులు జీ రమేష్, జిల్లా కార్యదర్శి ఎం రమేష్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆవులమంద రమణమ్మ, డాక్టర్ వెంకట కృష్ణయ్య, చీమకుర్తి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి సీహెచ్ కొండయ్య, యోగమ్మ, అపార్ట్‌మెంట్ కం ఇస్త్రీదారుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నాగేశ్వరరావు, బూచిరాజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.